


# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 24-12-2023 సంపుటి : 06 సంచిక : 104 పేజీలు : 8 వెల : రూ 3-00

# 30న ప్రధాని మోదీ అయోధ్య రాక..

### భారీ రోడ్ షోకు సన్నాహాలు!

న్యూఢిల్లీ,డిసెంబర్24 ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో డిసెంబర్ 30న శ్రీరామ్ విమానాశ్రయం నుంచి అయోధ్యధామ్ రైల్వే స్టేషన్ వరకు ప్రధాని నరేంద్ర మోదీ రోడ్ షో నిర్వహించను న్నారు.ఇం దుకు సంబంధించిన ప్రణాళికను స్థానిక అధికారులు రూపొందిస్తు న్నారు. ఇదేవిధంగా ఎయిర్‌పోర్టు సమీపం లోని మైదానంలో జరగనున్న ప్రధాని మోదీ ర్యాలీకి సంబంధించి న బ్లూప్రింట్‌ను కూడా రూపొందిం చారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌సింగ్ మాట్లాడుతూ ప్రధాని సారధ్యంలో జరిగే ర్యాలీలో సుమారు లక్ష మంది కార్యకర్తలు పాల్గొంటా రన్నారు.



కాగా స్థానిక కమిషనర్ గౌరవ్ దయాల్, ఐజీ ప్రవీణ్ కుమార్, ఎస్ఎస్పీ రాజ్‌కరణ్ నయ్యర్‌లు సంయుక్తంగా విమానాశ్రయాన్ని, ప్రధాని ప్రతిపాదిత ర్యాలీ వేదికను పరిశీలించారు. పార్కింగ్ స్థలాలను కూడా పరిశీలించారు. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నగర ఎస్పీ మధుబన్ సింగ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.ఇదిలావుండగా అయోధ్యలోని నూతన రామాలయ ప్రారంభోత్సవ వేడులకు వచ్చే భక్తులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు చెందిన 165 మంది వైద్యులు సేవలందించనున్నారు.

# పివికి ఘనంగా నివాళి

### ఘాట్ వద్ద నివాళి అర్పించిన గవర్నర్
### దార్శనికుడు పివి అని స్మరించిన సిఎం రేవంత్

హైదరాబాద్,డిసెంబర్24 : దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప మేధావి పీవీ నరసింహారావు అని గవర్నర్ తమిళసై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పీవీ వర్ధంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీవీ ఘాట్ వద్ద వీరు నివాళులర్పించారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 19వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. శనివారం పీవీ జ్ఞాన భూమి వద్ద సీఎం, మంత్రులు పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మంత్రులు, నేతలు పివికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి పీవీ అని కొనియాడారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారినప్పుడు సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. బంగారాన్ని కుదవ పెట్టి అప్పులు తేవడంపై ఆయన ఒకే మాట చెప్పారు. తెలివైన వాడు సగం ఆస్తిని కుదవపెట్టి అయినా సరే మిగతా ఆస్తిని కాపాడుకుంటారని ఆయన చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. భూమిని పేదవాడికి అందుబాటులోకి తీసుకొచ్చిన వ్యక్తి పీవీ అని



సీఎం పేర్కొన్నారు. పేదలకు భూములు పంచడానికి పీవీ బలమైన పునాదులు వేశారు. పీవీ మన మధ్య లేకపోయినా వారి సంస్కరణలు సదా ఆచరణీయం. పీవీ ఘాట్, జైపాల్ రెడ్డి ఘాట్‌లను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వీరిద్దరూ తెలంగాణకు లంకె బిందెల్లాంటి వారు. పీవీ కీర్తిని పెంచేలా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుంది అని రేవంత్ అన్నారు.

# చంద్రబాబుతో ప్రశాంత్ కిషోర్ భేటీ



ఆంధ్రా రాజకీయాలకు సంబంధించి బ్రేకింగ్ న్యూస్ ఇది. టీడీపీ అధినేత చంద్రబాబుతో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ భేటీ అయ్యారు.నారా లోకేష్, కిలారి రాజేష్‌లో కలిసి ప్రత్యేక విమానంలో విజయవాడ వచ్చారు పీకే. అనంతరం.. ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబుతో భేటీ అయ్యారు. ప్రశాంత్ కిషోర్, చంద్రబాబు సమావేశంలో గత కొంతకాలంగా టీడీపీ వ్యూహకర్తగా పనిచేస్తున్న రాబిన్ శర్మ కూడా పాల్గొన్నారు. రాబిన్ శర్మ టీం సర్వేలపై సమావేశంలో చర్చించను న్నారు. కాగా గత ఎన్నికల సమయంలో వైసీపీ తరఫున పనిచేశారు ప్రశాంత్ కిషోర్.యువగళం పేరిట నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్ర ఇటీవల ముగిసిన విషయం తెలిసిందే. పాదయాత్ర ముగియడంతో పార్టీ ఎన్నికల సన్నద్ధతపై వివిధ స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. టికెట్ల కేటాయింపు, జనసేనతో పొత్త విషయంలో కూడా కీలక చర్చలు జరుగుతున్నాయి. ముందే సోషల్ మీడియాను మరింత బలోపేతం చేసేందుకు వ్యూహాలు రచిస్తుంది టీడీపీ.

## బాబు ముందస్తు బెయిల్ తీర్పు రిజర్వ్

అమరావతి,డిసెంబర్23( : ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. ప్రభుత్వం దాఖలు చేసిన లిఖిత పూర్వక వాదనల్లో టీడీపీ నేత లోకేష్‌పై చేసిన వ్యాఖ్యలపై టీడీపీ న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా చంద్రబాబు తరపు న్యాయవాదులు శనివారం హైకోర్టులో దాఖలు చేశారు. వీటిని పరిశీలించిన హైకోర్టు నాయమూర్తి.. చంద్రబాబు ముందస్తు బెయిల్‌పై తీర్పును రిజర్వ్ చేశారు.

# కలసి పోరాడితేనే జగన్‌ను ఓడిస్తాం



### తెలంగాణలో అలాగే విజయం సాధించాం
### ఇక్కడా అన్ని పార్టీలు కలసి ముందుకు రావాలి
### పార్లమెంట్‌ను రక్షించలేని బిజెపివి డ్రామాలు
### సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వ్యాఖ్య

న్యూఢిల్లీ,డిసెంబర్23 : ఏపీలో రాజకీయ పరిస్థితులు అనిశ్చితంగా ఉన్నాయని, జగన్‌ను ఎదుర్కోవాలంటే ఏపీలో అన్ని పార్టీలు కలవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సూచించారు. కలసి పోరాడితేనే జగన్‌ను ఓడించగలుగుతామని అన్నారు. తెలంగాణలో ఇలానే విజయం సాధ్యమయ్యిందని అన్నారు. ఇందుకోసం ఇండియా కూటమిలో ఉన్నవారితోనే తమ పొత్తులని తేల్చారు. ఏపీలో పార్టీలు అన్నీ కేంద్ర హోంమంత్రిని, బీజేపీని చూసి భయపడుతున్నాయని నారాయణ అన్నారు. మోడీని వ్యతిరేకిస్తే తమకు ఎక్కడ ఇబ్బందులు సృష్టిస్తారో అని వారంతా భయపడుతున్నారని, ఇండియా కూటమికి అనుకూలంగా ఉండేవారితోనే మా పొత్తులు ఉంటాయని నారాయణ స్పష్టం చేశారు. బీజేపీ వల్ల రెండు తెలుగు రాష్ట్రాలు నష్టపోయాయని, ప్రత్యేక హోదా సహా ఏదీ రాలేదన్నారు. తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది బీజేపీయే. వారితో అంటకాగే పార్టీలకు కూడా ప్రజలు ఓటు వేయరు. జగన్‌కు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు కలిసి వెళ్ళాలి అన్నది మా ఉద్దేశం. టీడీపీని ఇండియా కూటమిలోకి ఆహ్వాని స్తున్నాం. పోల్ మేనేజ్‌మెంట్‌కు భయపడి వారు బీజేపీ పొత్తు కోసం ఆరాటపడుతున్నారని నారాయణ అన్నారు. పార్లమెంట్‌నే కాపాడలేని అసమర్థులు భారతదేశాన్ని ఎలా కాపాడతారని మోదీ ప్రభుత్వాన్ని నారాయణ ఎద్దేవా చేశారు. శనివారం నాడు ఢిల్లీలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...భారతదేశ చరిత్రలో ఇంత మంది ఎంపీలను సస్పెండ్ చేసిన ఘటన గతంలో ఎప్పుడూ లేదు. వారు చేసిన తప్పేంటి? పార్లమెంట్‌పై దాడి ఘటనపై చర్చకు పట్టుబట్టారు. ఒకవేళ ఏదైనా జరిగితే సభ్యులు చనిపోయేవారు కదా? బీజేపీ ఎంపీ పాస్ ఇవ్వడం నిజమా కాదా? పొరపాటున ఏ ఓఎఓ ఎంపీ ఇచ్చి ఉంటే ఏం చేసేవారు? పార్లమెంట్‌నే కాపాడలేని అసమర్థులు భారతదేశాన్ని ఎలా కాపాడతారు? ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందని నా అనుమానం అని నారాయణ అన్నారు. ఎన్నికల్లో లబ్ది కోసం చేసిన నాటకీయ ప్రక్రియలా అనిపిస్తోంది. సీరియస్‌గా వ్యవహరించాలి? అలాంటిదేమీ కనిపించడం లేదే? ఎన్నికల జిమ్మిక్‌లో భాగంగానే పార్లమెంట్‌లో ప్రమాదకర గేమ్ ఆడారు. ఇండియా కూటమికి దేశంలో జనాదరణ పెరుగుతుంది

# సమగ్ర ప్రణాళికతో సాధారణ ఎన్నికలు

### శూన్య దోష ఓటర్ల జాబితాతో వివాద రహిత ఎన్నికలు
### పోలింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్వీప్
### ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, నిష్పక్షపాతమే కీలకం
### ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్ కుమార్ వ్యాస్‌ల నేతృత్వంలోని బృందం
### ఎస్ఎస్ఆర్-2024, ఎన్నికల సన్నద్ధతపై విజయవంతంగా ముగిసిన సమీక్ష
### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా

అమరావతి డిసెంబర్ 23 ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో నోటిఫికేషన్ వచ్చే నాటికే 360 డిగ్రీ-సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని దీనివల్ల ఎలాంటి గందరగోళానికి తావులేకుండా శాంతియుత వాతావరణంలో సజావుగా ఎన్నికల నిర్వహణకు వీలవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్ కుమార్ వ్యాస్‌ల నేతృత్వంలోని బృందం జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులు ఎస్పీలకు దిశానిర్దేశం చేసింది.ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)-2024, సాధారణ ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై శుక్రవారం నోవాటెల్‌లో ప్రారంభమైన సమీక్షా సమావేశం శనివారం కూడా కొనసాగింది.ఈ సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ నితీష్ కుమార్ వ్యాస్ స్వీప్ డైరెక్టర్ సంతోష్ అజ్మేరా ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్ అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ డైరెక్టర్ (ఎక్స్‌పెండిచర్)




యశ్వీంద్ర సింగ్‌తో పాటు ఏపీ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎంఎన్ హరేంధిర జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరరావు స్టేట్ పోలీస్ నోడల్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ తదితరులు హాజరయ్యారు. జిల్లాల్లోని అసెంబ్లీ పార్లమెంటు నియోజకవర్గాలు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ ప్రక్రియ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు వారి ఫిర్యాదుల పరిష్కారం వివిధ ఫారాల పరిష్కారం ఇంటింటి సర్వే అనామలీస్ ఫొటో డెమోగ్రాఫిక్ సిమిలారిటీల పరిష్కారం స్వీప్ కార్యక్రమాల నిర్వహణ డిస్పాచ్ రిసీట్, ట్రైనింగ్ సెంటర్లు ఎన్నికల సిబ్బంది, శిక్షణ తదితరాలపై శుక్రవారం 19 జిల్లాల కలెక్టర్లు ఎస్పీలు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా శనివారం ఉదయం నంద్యాల అనంతపురం శ్రీ సత్యసాయి ఎన్ టీఆర్ అన్నమయ్య చిత్తూరు తిరుపతి జిల్లాల కలెక్టర్లు ఎస్పీలు తమ జిల్లాల ఎస్ఎస్ఆర్-2024 పురోగతిని, ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలను తెలియజేశారు.

# సీట్లు మార్చినంత మాత్రాన గెలవలేరు

### జగన్ సాహసాలు పార్టీని గెలిపించకపోవచ్చు
### చంద్రబాబు, పవన్ కలయిక వారికి బలమే
### ఏపిలో కాంగ్రెస్ పుంజుకునే అవకాశాలు
### మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ వ్యాఖ్యలు

రాజమండ్రి,డిసెంబర్23 : రాజకీయాల్లో జగన్‌కు అంత అనుభవం లేదని సీట్లు మార్చే ప్రక్రియ సరికాదని రాజమండ్రి ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. ఏపీలో ఎమ్మెల్యేలకు ఎక్కడా అధికారం లేదు.. అధికారం అంతా జగన్ మోహన్ రెడ్డి, వాలంటీర్ల చేతుల్లో మాత్రమే ఉందని ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. అప్పులు చేసి సంక్షేమ పథకాల పేరుతో డబ్బులు పంచడం ఎక్కడా చూడలేదని జగన్ మోహన్ రెడ్డి దేశంలోనే గొప్ప ప్రయోగం చేశాని సెటైర్ వేశారు. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడిన ఆయన పవన్ కళ్యాణ్ చంద్రబాబు కలవడం కచ్చితంగా వాళ్లకి బలమే అవుతుందని అన్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుందని, తెలంగాణ ఎన్నికల ప్రభావం కచ్చితంగా కనపడుతుందని ఉండవల్లి పేర్కొన్నారు. రాజకీయాల్లో త్యాగాలు చేయడానికి ఎవరూ రారన్నారు. సీటు లేదని చెప్పాలంటే దానికి చాలా అనుభవం ఉండాలన్నారు. అటువంటి అనుభవం జగన్ మోహన్ రెడ్డికి ఉందని నేను అనుకోవడం లేదు. టికెట్లు మార్చే ప్రక్రియ సరికాదు. టికెట్లు మార్చకపోతే అక్కడ కేసీఆర్ ఓడిపోయారు.. మార్చితే ఇక్కడ జగన్ గెలుస్తారని అనుకోవడం కూడా సరికాదని ఉండవల్లి అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ అంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అమితమైన అభిమానం. అటువంటి నెహ్రూను విజయసాయి పార్లమెంట్లో తప్పుపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో హిందుత్వం తగ్గుతుందని



అనడం వాస్తవం కాదని ఉండవల్లి అన్నారు. జేడీ పార్టీ పెట్టడం ద్వారా సీట్లు సాధించకపోవచ్చు.. కానీ ఓట్లు ఎంత శాతం సంపాదిస్తుంది అనేది రాజకీయ పరిణామాలు మారడానికి అవకాశం ఉందని ఉండవల్లి తెలిపారు. చంద్రబాబు నాయుడు, జగన్మోహన్ రెడ్డి నిజాయితీగల పార్టీని నడపడం రాక కాదు, నడపడం వల్ల ప్రయోజనం లేదని విశ్లేషించారు. రాజమండ్రిలో విచ్చలవిడిగా భారీ వృక్షాలను నరికేస్తున్నారు.. వెంటనే దాన్ని ఆపాలి. మళ్లీ ఎటువంటి చెట్లు పెంచడం వల్ల కాదని అన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 24-12-2023

## కొత్త వేరియంట్ కలవరం !

కరోనా ముప్పు తొలగిపోలేదని తాజా ఘటనలతో మరోమారు రుజువు అవుతోంది. కొత్త వైరస్ వణికి స్తోంది. దీంతో మనదేశం కూడా అప్రమత్తం కాక తప్పలేదు. ప్రజలకు మళ్లీ హెచ్చరికలు చేయకా తప్పడంలేదు. కేరళలో ఇప్పటికే వైరస్ తీవ్రత మొదలయ్యింది. తమిళనాడులో కూడా కొన్ని కేసులు వచ్చాయి. హైదరాబాద్ నీలోఫర్‌లో చిన్నారికి, భూపాలపల్లి జిల్లాలో ఓ మహిళకు కరోనా ఉన్నట్లు గుర్తించారు. భారత్‌లో కరోనా వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకూ 24 గంటల వ్యవధిలో కొత్తగా 756 కేసులు బయటపడ్డాయి. తాజా కేసులతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,420కి పెరిగింది. గత ఏడు నెలల్లో కేసుల సంఖ్య ఇంత చేరడం ఇదే తొలిసారి. ప్రస్తుతం దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరగడానికి కొత్త వేరియంట్ జేఎన్.1 కారణమని తెలుస్తోంది. ఇక గత 24 గంటల వ్యవధిలో మహమ్మారి కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కేరళలో ఇద్దరు కాగా, రాజస్థాన్, కర్ణాటకలో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. దీంతో వైరస్ కారణంగా మరణించిన వారి సంఖ్య 5,33,332కి ఎగబాకింది. ఇప్పటి వరకూ దేశంలో కరోనా వైరస్ బారిన పడిన వారి సంఖ్య 4.50 కోట్లకు చేరింది. మహమ్మారి నుంచి 4,44,71,212 మంది కోలుకున్నారు. ఇక మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసుల సంఖ్య 0.01 శాతం మాత్రమేనని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. అదేవిధంగా రికవరీ రేటు 98.81 శాతం, మరణాలు 1.18 శాతంగా ఉన్నాయని తెలిపింది. ఇప్పటి వరకూ 220.67 కోట్ల (220,67,79,081) కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు వెల్లడించింది. అయితే కొత్త వేరియంట్ ప్రభావం చూపుతున్న క్రమంలో జాగ్రత్తలు అవసరమని హెచ్చరించింది. పండగలతో పాటు, చలి పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని కేంద్రం ఇప్పటికే పలు రాష్ట్రాలను హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాల్లో కూడా జెఎన్-1 కొత్త వేరియంట్ లక్షణాలున్న వారిని గుర్తించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, జాగ్రత్తలు పాటించడం మళ్లీ అలవాటు చేసుకోవాల్సిన అసవరం పెరిగింది. చలి పెరగడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యనిపుణులు కూడా హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా కూడా అనేక రుగ్మతలు వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర మార్గదర్శకాల నేపథ్యంలో మళ్లీ ఆంక్షల్లోకి వెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే అనేక రాష్ట్రాలు ఆంక్షలు విధించడం మొదలు పెట్టాయి. దీంతో వరుసగా వస్తున్న క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగల సందర్భంగా ఒకేచోట వేలమంది గుమి గూడే పరిస్థితి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి అవసరాన్ని ప్రస్తుత పరిస్థితులు సూచిస్తున్నాయి. ఈ మేరకు కేంద్రం కూడా ఆయా రాష్ట్రాలకు సూచించింది. ఈ క్రమంలో ఇక పండగల వేళ మళ్లీ సందడి లేకుండా పోయే రోజులు వచ్చాయన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది. అయితే మన జాగ్రత్తలో మనం ఉంటూ ముందుకు సాగడం ద్వారా కొత్త వైరస్ వ్యాప్తిని అరికట్టాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతిపైనా దీని ప్రభావం పడనుంది. అంతకు ముందే న్యూ ఇయర్ వేడుకలపైనా ప్రభావం చూప నుంది. మొత్తంగా న్యూ ఇయర్ వేడుకల నిర్వహణలో పలు జాగ్రత్తలు పాటించాలి. అయ్యప్ప భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం హెచ్చరించింది. రెండేళ్లక్రిం కూడా ఇలాంటి పరిస్థితే వచ్చింది. దీంతో క్రిస్మస్, న్యూఇయర్ వేడుకలపై తీవ్ర ప్రభావం పడింది. ఆంక్షలే విధిస్తే..కరోనా మళ్లీ విజృంభిస్తే ఇది ఓ రకంగా చిన్న వ్యాపారులకు తీరని దెబ్బ కాగలదు. ఇప్పటికే కరోనా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశించింది. మరోవైపు కోవిడ్ మార్గదర్శకాలను ఎప్పటి కప్పుడు పాటించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కేంద్ర మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించడం తో వైరస్ వ్యాప్తిని గుర్తించి ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి. కొత్త వేరియంట్ విజృంభిస్తున్ననం దున ప్రభుత్వాలు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా హెచ్చరిం చాయి. పండుగలకు పెద్ద ఎత్తున జనం గ్రామాలకు వెళ్లే అవకాశం ఉ న్నందున ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని ఆదేశించింది. గ్రామాలకు వెళ్లేవారు జగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని పరోక్షంగా చెప్పింది. ఈ క్రమంలో ఇప్పటికే అనేక రాష్ట్రాలు ఆర్టీపిఎస్ పరీక్షలకు రంగం సిద్దం చేసాయి. ఆస్పత్రులను వైద్య సేవలకు అనుగుణంగా సిద్దం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాలు కోవిడ్ నిబంధనల మేరకు చర్యలకు ఉపక్రమించాయి. అయితే కొత్తగా వ్యాప్తి చెందుతున్న జెఎన్-1 డేంజర్ కాదని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. కానీ కేసుల సంఖ్యలో రోజురోజుకూ మార్పులు వస్తున్నాయి. క్రమంగా కేసుల సంఖ్య పెరుగుతోంది. అయినా మనం భయపడాల్సిన అవసరం లేదని కూడా అంటున్నారు. ఇకపోతే దేశంలో ఇప్పటికే 90 శాతానికిపైగా రెండు వ్యాక్సిన్ డోసులు తీసుకున్నారు. అందులో దాదాపు 90 శాతం మంది కొవిడ్ బారిన పడ్డారు. తద్వారా వారిలోని సహజ రోగనిరోధక శక్తి పెరిగింది. ఇలా మనదేశంలో హైబ్రిడ్ ఇమ్యూనిటీ ఉన్నందున కొత్త వేరియంట్లు పెద్దగా ప్రభావం చూపడం లేదని పేర్కొంటున్నారు. అయినా అప్రమత్తంగా ఉండడం మంచిదని సూచిస్తున్నారు. ఇకపోతే మొత్తంగా ఇప్పుడు తాజా పరిస్థితులను చూస్తుంటే ముప్పు కళ్లముందే కనిపిస్తోంది.

# గొప్ప రాజనీతిజ్ఞుడు మన పీవీ

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే. బాబురావు



విభారె న్యూస్ డిసెంబర్ 23 కర్నూలు (జిల్లా ప్రతినిధి). భారత దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన పివి నరసింహారావు అని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే బాబురావు అభిప్రాయపడ్డారు. భారత మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ శ్రీ పివి నరసింహారావు 19 వ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన హయాంలో భూసంస్కరణల చట్టం అమలు చేసి వందలాది ఎకరాలు కలిగివున్న భూస్వాముల నుంచి భూములను ఒకే చట్టం ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకునేట్టు చేశారని భూస్వాముల ఆగ్రహావేశాలను లెక్కచేయకుండా భూసేకరణ చట్టం పకడ్బందీగా అమలు చేసిన ధైర్యశాలి మన పివి అని భూస్వాముల కుటుంబానికి చెందిన పీవీ తన పన్నెండు వందల ఎకరాల భూమిని భూమిలేని పేదలకు పంచారని పివీ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పెత్తందార్లు అడవులలోని వన్యమృగాలను చంపడంతో చలించిపోయి వాటి సంరక్షణకు వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చారని, పివీ సేవలను జాతీయ స్థాయిలో ఉపయోగించు కోవాలని భావించిన శ్రీమతి ఇందిరా గాంధీ ఆయనను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమించారని, పివి శ్రీమతి ఇందిరా గాంధీకి అత్యంత నమ్మకస్తుడిగా ఉన్నారని, ఎమర్జెన్సీ తర్వాత దేశమంతటా కాంగ్రెస్ ఓడిపోయినా మన రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ జెండా రెపరెపలాడించాడని నాడు రాష్ట్రంలో 42 పార్లమెంటు స్థానాల్లో 41 స్థానాలు కాంగ్రెస్‌కు రావడం వెనుక పివి గారి పాత్ర కీలకమని, ఇందిరా గాంధీ హయాంలో తన బహుముఖ ప్రతిభ సామర్థ్యాన్ని అంతర్జాతీయ దౌత్యానికి ఉపయోగించారని, ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆరు మాసాల్లో నంద్యాల పార్లమెంటు స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందిన ఘనత మన పివి కి దక్కుతుందని, భారత ప్రధానిగా ఉన్న కాలంలో దేశంలో ఎన్నో రాజకీయ ఆర్థిక సామాజిక మలుపులు చోటు చేసుకున్నాయని దివాలా తీసే స్థాయికి చేరుకున్న ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం కల్పించి సంస్కరణలకు బీజం వేశారని అందుకే పీవీని దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పిలుస్తారని, దేశాన్ని ఏలిన ఏకైక తెలుగు వాడిగా చరిత్రకెక్కిన పీవీ గొప్పతనం గురించి బాబురావు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పార్టీ కార్యాలయం నందలి స్వర్గీయ పివి నరసింహారావు చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, సేవాదళ్ జిల్లా అధ్యక్షురాలు ఏ వెంకట సుజాత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉండవల్లి వెంకటన్న, డిసిసి సెక్రెటరి యజాస్ అహ్మద్, కోఆర్డినేషన్ మెంబర్లు విక్టర్, జోసెఫ్ నోయల్, మైనార్టీ సెల్ నాయకులు ఎస్ఎం ఖాద్రి, షేక్ మాలిక్, రజాక్ వలి, వసిబాషా అబ్దుల్ హై, ఎస్సీ సెల్ డబ్ల్యూ సత్యరాజు, కాంగ్రెస్ నాయకులు ఆనందం, అభినాయుడు, జేమ్స్, మహిళా కాంగ్రెస్ కె వెంకటలక్ష్మి, పుష్పలీల, కరుణమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

# క్రీస్తు జననం అపూర్వమైనది..

### - జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే బాబురావు.



విభారె న్యూస్ డిసెంబర్ 23 కర్నూలు (జిల్లా ప్రతినిధి).క్రీస్తు జననం అపూర్వమైనదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబు రావు అభిప్రాయపడ్డారు. శుక్రవారం రాత్రి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నందు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ అధ్యక్షతన జరిగిన సెమి క్రిస్మస్ కార్యక్రమం జరిగింది. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా రెవరెండ్.ఆర్.అనిల్ కుమార్ సామ్యూల్ మాట్లాడుతూ యేసు క్రీస్తు జననానికి గుర్తుగా,ప్రపంచ వ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు జరుపుకునే పండుగ క్రిస్మస్ అని, క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధించడం అని, యేసు మన కోసం చనిపోయి తిరిగి బ్రతికాడని, క్రైస్తవులు గుర్తుంచుకుంటారన్నారు. క్రీస్తు జననం వల్ల రెండు అపూర్వ ఘట్టాలు మానవ చరిత్రలో ఆవిష్కరింప బడ్డాయని అవి క్రీస్తుకు పూర్వం, క్రీస్తు శకంగా గుర్తింపులోకి వచ్చాయన్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కె బాబు రావు మాట్లాడుతూ క్రీస్తు ప్రేమ, ఆప్యాయతలను పెంచు, శాంతిని పంచు అంటూ పాపాల నుండి ప్రజలను విముక్తి చేయడానికి జన్మించిన క్రీస్తు ఆ ప్రజల కోసమే ముళ్ళ కిరీటాన్ని ధరించి, సిలువపై రక్తం చిందించాడనీ ఈప్రపంచానికి క్రీస్తు ప్రేమ తత్వమే దేవోపదేశము మానవత్వమే సారాంశము అని బాబురావు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీసీ చర్చ్ క్వాయర్ వారు పాటలు పాడి దేవుణ్ణి స్తుతించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎం సుధాకర్ బాబు,రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధకృష్ణ, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల,సేవాదల్ జిల్లా అధ్యక్షురాలు ఏ వి సుజాత,మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపేట మున్న,మైనారిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాద్రీ పాషా, డీసీసీ కార్యదర్శులు ఎజాజ్, రియాజ్, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, నవీద్, నాగ శేషు, పాస్టర్లు, సీసీ సంఘసభ్యులు,వీరితో పాటు సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ మొదలగు వారు పాల్గొన్నారు

## 108 కోట్ల రామ కోటి లిఖిత పూజా యజ్ఞం లో భాగంగా ప్రత్యేక పూజలు..



విభారె న్యూస్ డిసెంబర్ 23 కర్నూలు (జిల్లా ప్రతినిధి). 108 కోట్ల రామకోటి లిఖిత పూజా యజ్ఞంలో భాగంగా శనివారం కర్నూలు అవోపా సేవా సదన్ నందు వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఇప్పటి వరకు వచ్చిన 6772 పుస్తకాలకు ప్రత్యేక పూజలు నర్వ హించారు.టి.జి. భరత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పూజానంతరం ప్రత్యేకంగా అలంకరంచిన వాహనంలో రామకోటి పుస్తకములు అమర్చి, భరత్ కాషాయ జెండా ఊపగా వాహనం అయోధ్యకు బయలుదేరింది.తదనంతరం దాతలను, కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నవారిని జ్ఞాపికతో సత్కరించారు.వైకుంఠ ఏకాదశి రోజున ఈ శుభకార్యం జరగడం మన అదృష్టం.మనము రాసిన రామకోటి పుస్తకాలు మరి కొద్దిరోజులలో అయోధ్య చేరును.రామకోటి లిఖిత యజ్ఞంలో పాల్గొన్న , సహకరించిన అందరికీ శతకోటి వందనాలు.

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కావాలంటే తెదేపా అధికారంలోకి రావాలి

**ఎన్ని కుట్రలు చేసినా యువగలాన్ని ఆపలేకపోయారు**
**ఆడదాం ఆంధ్రతో విద్యార్థులతో ఆడుకుంటున్నారు**
**రైతులకు నీళ్లు కావాలంటే ఎమ్మెల్యే బంధువులకు కప్పం కట్టాలా**
**మాజీ మంత్రి భూమా అఖిలప్రియ**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, ప్రతినిధి డిసెంబర్ 23 విభారె న్యూస్ :-అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు బనాయిస్తూ అభివృద్ధి లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ తయారైందని, మన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలంతా మద్దతు పలకాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం తన కార్యాలయం లో విలేకరులతో మాట్లాడుతూ సమస్య లతో సతమతమవుతున్న ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కావాలంటే తెదేపా తోనే సాధ్యమన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రజాసమస్య లు, యువత బాగు గురించి రైతుల కష్టాల గురించి తెలుసుకునేందుకు యువగలం పాదయాత్ర చేపట్టాలని, కానీ ఆయన పాదయాత్రకు ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు కల్పించిందని ఆమె ఆరోపించారు. కానీ ఆయన యువగలం యాత్రను ఆపలేకపోయా రన్నారు. ప్రతి నియోజకవర్గంలో పర్య టించి ఆ ప్రాంత సమస్యలను తెలుసు కొని రాజకీయ పరిస్థితులను తెలుసు కొని మాస్ లీడర్ గా నారా లోకేష్ పేరు పొందారన్నారు. పార్టీలకు అతీతంగా ఆయనను మెచ్చుకున్నారన్నారు. యువగలం ముగింపు కార్యక్రమం సందర్భంగా వచ్చిన అశేష జన వాహిని చూసి వైకాపా గుండెల్లో గుబులు ప్రారంభమైందన్నారు. చంద్రబాబు అరెస్ట్ అయిన తర్వాత జైల్లో ఉన్న ఆయనను పరామర్శించడా నికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వెళ్లడం జరిగిందని వచ్చిన వెంటనే ఆయన తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం జనసేన టిడిపి ఏకమయ్యాయని ఆమె అన్నారు. వైకాపా 60 నుండి 70 మంది ఎమ్మెల్యేలను మారుస్తోందంటే వారి పట్ల పార్టీ పట్ల ప్రజలకు వ్యతిరేకత ఎంత వచ్చిందో అర్థమవుతుందన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మన రైతుల కోసం కాదని తెలంగాణ కోసం ముఖ్యమంత్రి అయినట్లుగా ఆయన వ్యవహార శైలి కనిపిస్తోందన్నారు. చందలూరు కు తాను భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం కోసం వెళ్లడం జరిగిందని అక్కడ రైతులు తమ పొలాలు ఎండిపోతున్నాయని సాగునీరు ఇప్పించాలని తన దృష్టికి తెచ్చారన్నారు. నీళ్లు ఎందుకు రాలేదు అని అడగగా నీళ్లు కావాలంటే ఎమ్మెల్యే బంధువులకు 6 లక్షల రూపాయల కప్పం కట్టాలని నాతో వారు చెప్పారన్నారు. అహోబిల శ్రీ లక్ష్మీనరసింహస్వామి మీద ప్రమాణం చేసి ఇది నిజమా కాదా అని ఎమ్మెల్యే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టడమే ధ్యేయంగా వైకాపా ప్రభుత్వం పనిచేస్తుందని నాయకులకు వత్తాసు పలికే అధికారులను ఉపేక్షించేది లేదన్నారు. నియోజకవర్గంలో రెడ్ బుక్ తయారు చేశామని లెక్కకు లెక్క తేలుస్తామన్నారు. ఆళ్లగడ్డలో రౌడీయిజం చేస్తున్నారని చేసేవారి వెనుక ఎవరు ఉన్నారనేది తనకు తెలుసు అని తెలుస్తామని ఆమె అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతునీదని ఎన్నికలు దగ్గర ఏ సమయంలో క్రీడలా. ఇదంతా చూస్తుంటే ఎన్నికల డ్రామాగా కనిపిస్తోందని ఆమె అభివర్ణించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించామన్నారు. ప్రజలందరి ఆశీస్సులు చంద్రబాబుకు, లోకేష్ కు అందజేయాలని అఖిలప్రియ కోరారు.

# రాయల్ పాఠశాలలో జాతీయ వ్యవసాయ దినోత్సవం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 23- నంద్యాల పట్టణం నడిగడ్డ యందు రాయల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల యందు జాతీయ వ్యవసాయ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ యాకుబ్, పాఠశాల కరస్పాండెంట్ ఇషాక్ వలి పాల్గొన్నారు. పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ వి. యాకుబ్ మాట్లాడుతూ విద్యార్థులు రైతులు పడే కష్టాలను రైతులు పండించే పంటలు గురించి రైతులు పడే ఇబ్బందులు గురించి విద్యార్థులు వివిధ వేషాధారణలో రైతులు పడే కష్టాలు గురించి చాలా గొప్పగా వివరించడం జరిగింది. రైతులు దేశానికి వెన్నముకలాంటివారు అని అలాగే రైతులకు భీమా చట్టాలు అయితే నేమి పంటలు పంటలు దెబ్బ తినడం వల్ల రైతుల ఆదాయం కోల్పోకుండా ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన బాధ్యత ఉందనితెలిపారు. విద్యార్థులు వివిధ పంటల కూరగాయలు ఆహార పదార్థాలు ప్రదర్శించడం జరిగినది. ఈ జాతీయ రైతు దినోత్సవం భారత దేశ ఐదవ ప్రధాని చరణ్ సింగ్ జన్మదిన పురస్కరించుకొని భారత ప్రభుత్వం జాతీయ వ్యవసాయ దినోత్సవం ప్రకటించడం అయినది. ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించడానికి కారకులైన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ ఇషాక్ వలి అభినందనలు తెలిపారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు....







కోసిగి, డిసెంబర్ 23(విభారె న్యూస్) మండల కేంద్రంలోని మౌంట్ కార్మెల్ హై స్కూల్ నందు సెమీ క్రిస్మస్ వేడుకలను ప్రిన్సిపాల్ జాన్సన్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సహాయ విద్యాధికారి సామ్యూల్ పాల్ హాజరై సెమీ క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ అంటే సంతోషం ప్రేమ,దయ,కరుణ కలగలిపి ఉండే గొప్ప పండుగని విద్యార్థులకు తెలియజేశారు. సాటి మనిషిని ప్రేమించమని ఏసుక్రీస్తు చెప్పిన మాటలను ప్రతి ఒక్కరు నడుచుకొని నవ సమాజాన్ని నిర్మించాలని కోరారు. కులమతాలకు అతీతంగా మౌంట్ కార్మెల్ పాఠశాలలో సెమి క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషమని తెలిపారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. పాటలు,జింగల్ బెల్స్,ఏసుక్రీస్తు రూపం,చిన్నారుల ఆటపాటలు స్కిట్స్ ప్రదర్శన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ఆకర్షణగా శాంత క్లాస్ వేషధారణలో కనువిందు చేశారు. ఈ వేడుకల్లో ఏపీ మోడల్ స్కూల్ ఓర్వకల్ ప్రిన్సిపల్ జోషిలా,ఏపీ మోడల్ స్కూల్ క్రిష్ణగిరి ప్రిన్సిపల్ నిర్మల,కరస్పాండెంట్ ఫాదర్ టోనీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్త వేరియంట్ జెఎన్-1దడ

### విందులు, వినోదాల్లో జాగ్రత్తలు తప్పనిసరి

హైదరాబాద్,డిసెంబర్23 : ఏటా డిసెంబర్ 31 వచ్చిందంటే న్యూ ఇయర్ వేడుకల సందడి జోరుగా ఉండేది. తాజా పరిస్థితుల నేపథ్యంలో కొత్త సంవత్సర వేడుకలపై కొన్ని ఆంక్షలు తప్పేలా లేవు. మందుబాబులు మాత్రం ఇవేమీ లెక్కచేయకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు నగరంలో న్యూ ఇర్ సెలబ్రేషన్స్ కోసం సెలబ్రిటీలు,నటులతో ప్రత్యేక కార్యక్రమాలు.. చేపడుతున్నారు. డీజే సౌండ్లతో యువత డ్యాన్సులు.. కేకుల సందడి,యువత కేరింతలకు రంగం సిద్ధం అవుతోంది. డిసెంబర్ 31 దగ్గర పడుతున్నా క్రమంలో ఓవైపు పోలీసులు హెచ్చరికలు చేస్తున్నారు. మాస్కులు ధరిస్తే మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఈపాటికే స్టార్ హోటళ్లు.. ఈవెంట్లు సంస్థలు అర్ధరాత్రి కొత్త సంవత్సర వేడుకలకు రకరకాల ప్యాకేజీలు, ఆఫర్లతో బుకింగ్‌లు మొదలు పెట్టాయి. విందులు, వినోద ఈవెంట్లతో సందడి చేసేందుకు రంగం సిద్ధం చేశారు. కానీ సరిగ్గా కొత్త సంవత్సరం ప్రారంభానికి మరో వారం రోజుల ముందే కొత్త వేరియంట్ సందడి మొదటు పెట్టింది. ఈసారి మరోమారు వైరస్ దడ పుట్టిస్తోంది. ఈసారి కేసులు బాగా తగ్గిపోయి అన్నీ సద్దుమణిగి పోతున్నాయనుకునే లోపు మళ్లీ ఇప్పుడు వణుకుతో వేడుకల ఆశలపై నీళ్లు చల్లేఆ ఉంది. కరోనాకు ముందు నగరాలతోపాటు, పట్టణాల్లోను స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు, ఈవెంట్ సంస్థలు విందులు, వినోదాలు భారీగా ఏర్పాటు చేసేవి. ఈయేడు కూడా భారీగానే ఏర్పాట్లు చేశారు. తెలంగాణలో ప్రభావం తక్కువగా ఉందన్నకారణంగా ఏర్పాట్లు యధావిధిగా సాగుతున్నాయి.

# వైసిపి నుండి 50 కుటుంబాలు టిడిపిలోకి చేరిక.....





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 23 డోన్ తెలుగుదేశంపార్టీ కార్యాలయం నందు డోన్ మండలం, కొత్తబురుజు గ్రామం వైసిపికి చెందిన 50కుటుంబాలు టిడిపిలోకి డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో,నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్ సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ, డోన్ మండలం టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్, నంద్యాల జిల్లా టిడిపి కార్యదర్శి అబ్బీరెడ్డి పల్లె గోవిందు, నంద్యాల జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రామ్మోహన్ యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ మిద్దపల్లె గోవిందు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశంపార్టీ తోనే సాధ్యమనే ఉద్దేశ్యంతో టిడిపిలోకి రావడం జరిగిందని ఇంత వరకు వైసీపీ పాలనలో సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని,వైసీపీ పార్టీలో ఎంత కష్టపడినా గుర్తింపు లేదని అందుకే వారు టిడిపి కండువా కప్పుకోవడం జరిగిందని అన్నారు. జగన్ రెడ్డి పాలనలో రైతులకు న్యాయం జరగలేదని, పేద ప్రజల జీవితాలు మారాలన్నా, రాష్ట్ర అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలన్నా అది నారా చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమని ఈ సారి డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ జెండాను తప్పు ఎగురవేస్తామని అన్నారు. కొత్త బురుజు గ్రామం నుంచి టీడీపీలకు చేరినవారుఏ చలపతి,ఏ రంగస్వామి,ఏ రమణ,ఏ చిన్న రంగస్వామి, ఏ కృష్ణ, ఏ రంగస్వామి, రవికుమార్, మల్లన్న, రామగుండు, ముత్యాలు, చెంచు ప్రసాద్, తలారి మల్లికార్జున, ఆవుల లక్ష్మన్న, పింజారి పకిరా,కదిరి వెంకటప్ప,ఎరుకల సుధాకర్, నారాయణస్వామి, పి ఉషన్ పిరా,మాదిగ తిమ్మయ్య,( నల్ల బండ),తిరుపాలు,మహమ్మద్ దుదేకుల, సి గోపాల్, బి పుల్లయ్య, జి నారాయణ, గురకొండ అనిల్, మరెక పాకిరి, మాదిగ ఓబుళపతి, గాజుల యరన్నా,కొత్త బురుజు టీడీపీ నాయకులు: మాజీ సర్పంచ్ వెంకట్ రాముడు, చెంచు నాగేష్, వీరన్న, చిరంజీవి, గోవిందు, వెంకటేశ్వర్లు, ఫక్రుద్దీన్, నాగేష్, పకీర, రంగపు రాజు, ప్రకాశం, నారాయణస్వామి

## 12 రోజులుగా కొనసాగుతున్న అంగన్వాడీల రిలే దీక్షలు...





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 23 డోన్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె 12వ రోజు శనివారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో అంగన్వాడీ టీచర్లు,ఆయాలు ఉదయం నుండి సాయంత్రం వరకు రిలే దీక్షలతో కొనసాగించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి టి. శివరాం,మండల అధ్యక్ష,కార్యదర్శులు పి. రామాంజనేయులు,ఏవి. భాస్కర్ రెడ్డి,కోశాధికారి బి. నాగమద్దయ్య,ప్యాపిలి మండల కార్యదర్శి ఎస్. ఏ. చిన్న రెహమాన్,ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోయిలకొండ నాగరాజు,అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సులోచన,రహమద్ బి,సుమలత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలు 12 రోజులుగా రోడ్డున పడి సమస్యలు పరిష్కరించాలని అరిచి గీపెడుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వంనిరంకుశంగా,దుర్మార్గంగా వ్యవహరించడం అన్యాయమని సహనాన్ని పరీక్షించవద్దని ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెపై ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండా సామరస్యంగా పరిష్కరించాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారి వాగ్దానం ప్రకారం అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు,మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు,మినీ వర్కర్లకు ప్రమోషన్లు,రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు,ఆఖరి వేతనంలో 50% పెన్షన్,హెల్పర్ల ప్రమోషన్లలో నిబంధనలు రూపొందించడం,రాజకీయ జోక్యం అరికట్టడం,ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచడం సర్వీస్ లో ఉండి చనిపోయిన అంగన్వాడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం,బీమా అమలు చేయడం,రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచడం, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం,వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచడం,గ్యాస్ ను ప్రభుత్వమే సరఫరా చేయడం, పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, 2017 టీఏ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని,లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలని,వివిధ రకాల యాప్ లను రద్దుచేసి ఒకే యాప్ ద్వారా విధులు నిర్వహించే విధానం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శ్రీలత,లక్ష్మీన్వరి, యశోద,విజయలక్ష్మి,సుభద్ర,ఆదిలక్ష్మి,రాజేశ్వరి,శ్యామల, ప్రవీల,ఆయాలు ధనలక్ష్మి,మాధవి, అరుణ,లక్ష్మీదేవి,మాసుంబి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల దీక్షకు సుబ్బారెడ్డి మద్దతు...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 23 డోన్ పట్టణంలో కోర్టు దగ్గర జీవో నెం 512ను రద్దు చేయాలని న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపిన డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మరియు రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ

## క్రిస్మస్‌కు ముస్తాబైన మెదక్ చర్చి

### విద్యుద్దీపాలతో ధగధగలు

మెదక్,డిసెంబర్23 : ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన, అత్యుత్తమ కట్టడాల్లో ఒక్కటైన మెదక్ సీఎస్ఐ చర్చి క్రిస్మస్ శోభను సంతరించుకున్నది. విదద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులు చర్చిలో ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్రిస్మస్ వేడుకలను కనుల విందుగా జరిపేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసారు. చర్చిని విద్యుత్‌దీపాలతో అంగరంగ వైభవంగా ముస్తాబు చేసారు. 25న జరిగే క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. క్రిస్మస్ వేడుకలకు మెదక్ నుంచే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల నుంచి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు, పర్యాటకులు తరలివస్తుంటారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు చర్చి కమిటీ సభ్యులు తెలిపారు. ఇక చర్చి ప్రాంగణంలో వివిధ రకాల గృహ అలంకరణ, ఆటబొమ్మల దుకాణాలు వెలిశాయి. రంగుల రాట్నం, మినీ ఈత కొలనులు, జంపింగ్ గేమ్స్, మినీసర్కస్, మినీరైల్, పిల్లలు ఆడుకునే ఆట బొమ్మలను ఏర్పాటు చేశారు.

# రైతులకు మూడు లక్షల వరకు రుణమాఫీ 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్

**అధికారంలోకి వచ్చిన వెంటనే కలిగే ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ**
**డిగ్రీ పీజీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్మెంట్ పథకం**
**జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ ,**
**నంద్యాల పార్లమెంట్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు**



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ ప్రతినిధి డిసెంబర్ 23 విభారె న్యూస్ :- ఇంటింటికి కాంగ్రెస్ ప్రచార భాగంలో శనివారం ఉదయం అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న లక్ష్మి నరసింహ యాదవ్ అనంతరం స్వామి వారి సన్నిధిలో మాట్లాడుతూ కేంద్రంలో మరియు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అహోబిలం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం నందు పూజలు నిర్వహించాం అలాగే ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని 2019 పోటీ చేసి మరల రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గంనుంచిపోటీచేస్తానిప్రజలందరూమద్దతుగా నిలబడాలని కోరుకునీటున్నామన్నారు. అనంతరం అహోబిలంలో ఇందిరమ్మ కాలనీ నందు ఇంటింటికి కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. రాబోయే కాలంలో ఈ దేశాన్ని ముక్కలు చెక్కలు చేసి రాక్షస పాలన చేయడమే ఈ బిజెపి లక్ష్యం అబద్ధపు వాగ్దానాలతో నీతి కబుర్లతో గద్దెనెక్కి భారతదేశంగా విలువలను స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలను నాశనం చేస్తూ తమ స్వార్థానికి వాడుకుని ప్రజాస్వామ్యాన్ని భ్రష్టపట్టిస్తూ పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గట్టిగా బుద్ధి చెప్పాల్సిన ఆసన్నమైనదన్నారు. కేంద్రంలో మరియు రాష్ట్రంలో 2024 లో సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాలను అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకుసిపిఎస్‌రద్దుపాతపెన్షన్‌విధానం కొనసాగిస్తామన్నారు. న్యాయపతకం కింద పేదలకు సంవత్సరానికి 72,000 నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తామన్నారు. విభజన చట్టంలోని హామీలను పూర్తిగా నెరవేరుస్తామన్నారు. నంద్యాల పార్లమెంట్లో ఉన్న సిద్దేశ్వరం అలుగు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. నంద్యాల పార్లమెంట్ ప్రతి నియోజకవర్గంలో రైతు బజార్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పి మోసం చేయడం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయకపోవడం వైజాగ్ రైల్వే జోన్ కడప స్టీల్ ప్లాంట్ పూర్తి చేయకపోవడం కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయకపోవడం విభజన చట్టంలో ఉన్న హామీల అంశాలను నెరవేర్చకుండా తుంగలో దక్కి ఆంధ్ర ప్రజలను దారుణంగా మోసం చేసిన కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారం వచ్చినప్పటి నుంచి పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ నిత్యవసర వస్తువులు ధరలు పెంచి ప్రజల భారం మోపడం దేశంలో నూతన సాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయలేకపోవడం రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించలేకపోవడం ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయకపోవడం దళిత గిరిజన మైనార్టీల పైన దాడులు మహిళలపై అత్యాచారాలు పెరిగిపోవడం దానికి నిదర్శనమన్నారు. కావున ఈ బీజేపీ ప్రభుత్వానికి దేశాన్ని మరియు జగన్ రెడ్డి మన ఆంధ్రప్రదేశ్ ను పరిపాలించే అర్హత లేదు అందుకు ప్రజలందరూ బిజెపి మరియు జగన్ రెడ్డి ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధిలో ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆళ్లగడ్డ నియోజకవర్గం సమన్వయ కర్త బరగొడ్ల హుస్సేన్ బాషా , జిల్లా ప్రధాన కార్యదర్శి చాకలి పుల్లయ్య, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షంసుల్ హక్ , జిల్లా ఉపాధ్యక్షులు రమణ , జిల్లా మైనారిటీ అధ్యక్షులు పఠాన్ హాబీబ్ ఖాన్ , జిల్లా యస్సీ సెల్ అధ్యక్షులు నాగలింగమ్ , సిరివెల్ల మండల అధ్యక్షులు పసుపులేటి లక్ష్మి నరసింహ, ఆళ్లగడ్డ మండల అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు , జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సంజీవ కుమార్ , వెస్లీ , మల్లేశ్వర రెడ్డి , తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఘనంగా ముగిసిన సామాజిక సాధికార యాత్ర.

**-ప్రజాపాలనకు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నినాదమే జయహో జగనన్న..**
**-బడుగుల తలెత్తుకునేలా చేసిన జగనన్న : మంత్రి మేరుగ నాగార్జున.**
**సామాజిక సాధికారత చేసి చూపిన జగనన్న :ఎంపీ సంజీవ్‌కుమార్.**
**-వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు ఎంపీ గోరంట్ల మాధవ్.-**
**సామాజిక అభివృద్ధిలో ముందడుగులు పడుతున్నాయి : ఎంపీ గురుమూర్తి.**
**-బడుగు,బలహీన వర్గాలను చెయ్యిపట్టి నడిపిస్తున్న వైయస్ జగన్ : ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి.**



విభారె న్యూస్ డిసెంబర్ 23 ఎమ్మిగనూరు.శుక్రవారం రోజు ఎమ్మిగనూరు నియోజకవర్గంలో జరిగిన సామాజిక సాధికార యాత్రకు నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. భారీ ర్యాలీ జరిగింది. ర్యాలీ వెంబడి నడిచిన జనం... బహిరంగ సభకు హాజరయ్యారు. బహిరంగ పూర్తయ్యేవరకు ఏ ఒక్కరూ కదలకపోవడం విశేషం. స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీలు సంజీవ్‌కుమార్, గోరంట్ల మాధవ్, గురుమూర్తి పాల్గొన్నారు. ఇంకా స్థానిక సంస్థల ప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు మంత్రి మేరుగ నాగార్జునసామాజిక సాధికార యాత్ర చరిత్ర పుటల్లో లిఖించబడుతుంది. గతంలో మహానుభావులెం దరో.. ఈ దేశంలో సామాజిక సాధికారత సాధించాలని ఉద్యమాలు చేశారు. ఈ రాష్ట్రంలో...ఆ మహనీయుల ఆశయాల బాటలో నడిచి..మనకు సామాజిక సాధికారత అందించారు సీఎం జగనన్న.గతంలో చంద్రబాబు మనల్ని బెదిరించారు. చులకనగా మాట్లాడారు.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల ప్రజలు గుండెల మీద చెయ్యివేసుకుని ముందుకు నడుస్తున్నారు. ఆత్మగౌరవంతో జీవిస్తున్నారు.ఆయావర్గాలప్రజల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు జగనన్న.మన జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మన పిల్లల భవిష్యత్ గురించి ఎంతో ముందుచూపుతో పథకాలు అమల్లోకి తెచ్చారు.విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారు.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడం మన బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ వర్గాలకు చాలా చాలా అవసరం.ఎంపీ సంజీవ్‌కుమార్.ఇంతకు ముందు మన దళితకుటుంబాల వారు తలవంచుకుని బతికేవారు.అలాంటి వారిని అక్కున చేర్చుకుని, వారి తలరాతలు మార్చారు జగనన్న.జగనన్న పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సామాజిక సాధికారత సాధించిపెట్టారు సీఎం జగనన్న.సామాజిక న్యాయానికి అసలుసిసలు అర్థం చెప్పారు.ఈరోజు మనం ఎవరికీ భయపడాల్సిన లేదు. మనకు జగనన్న అండ ఉంది. ఆయన చేయూత ఉంది. ఆయన భరోసా ఉంది. దేవుడు జగన్ వెంట ఉన్నాడు. ఆయన ద్వారా మనకు సాయం చేసేలా చేస్తున్నాడు.ఇప్పుడు జగనన్న పాలనలో మన ఆత్మగౌరవం పెరిగింది. ఆత్మవిశ్వాసం పెరిగింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలందరూ జగనన్న వెంట నడవాలి.పేదల కోసం, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం జగనన్న చేస్తున్న మంచి, దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయట్లేదు. ఎంపీ గోరంట్ల మాధవ్ఈరోజు మిమ్మల్ని అందర్నీ చూస్తుంటే..చాలా సంతోషమేస్తోంది. జగనన్న మీద అభిమానంతో మీరంతా వచ్చారని అర్థమవుతోంది.మన ప్రత్యర్థి చంద్రబాబు రాజకీయంగా చేసిన అరాచకాలు మనకందరికీ తెలుసు.ప్రత్యేకహోదా వద్దు, ప్రత్యేక ప్యాకేజీ ముఖ్యమని చెప్పి, స్పెషల్‌స్టేటస్‌ను వదిలేసిన బాపతు రాజకీయనాయకుడు చంద్రబాబు.ఓటుకు నోటు కేసులో ఇరుక్కుని పదేళ్లపాటు అక్కడ నుంచి పాలన చేసే అవకాశం ఉన్నా,వదిలేసి వచ్చిన వాడు చంద్రబాబు. చెప్పుకుంటూ పోతే చంద్రబాబు తన హయాంలో ఎన్నెన్ని స్కాములు చేశాడో లెక్కకు మించి ఉంటాయి.వ్యవసాయం దండగ అని పనికిమాలిన మాటలు మాట్లాడిన నాయకుడు చంద్రబాబు.ఉచితవిద్యుత్ అడిగితే, విద్యుత్ బిల్లులపై ఉద్యమం చేస్తే, హైద్రాబాద్‌లో రైతులపై గుర్రాలతో తొక్కించి, కాల్పులు చేపించిన రాక్షసుడు బాబు.ఇక ఎస్సీ,ఎస్టీ,బీసీలను కులం పేరిటే చులకన చేసి మాట్లాడారు.చంద్రబాబు.మైనార్టీలను దేశద్రోహుల కింద లెక్కేసిన దుర్మార్గుడు. వారిపై కేసులు కూడా పెట్టారు.ఎంపీ గురుమూర్తి.అర్హతలున్న లబ్దిదారుల్లో ఏ ఒక్కరూ సంక్షేమపథకాల లబ్ది పొందకుండా ఉండకూడదని ముఖ్యమంత్రి జగన్ తపిస్తున్నారు. ఇంటి గడప దగ్గరకే సంక్షేమ పథకాల లబ్ధి అందేలా చేస్తున్నారు. వివక్ష లేకుండా, లంచాలు లేకుండా, పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదే. సమాజంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా వుంటేనే, బాగా చదువుకుని ఉంటేనే ఆ సమాజం అభివృద్ధి చెందుతుంది. నాడు?నేడు పథకంతో విద్య,వైద్యరంగాల్లో జగనన్న తెచ్చిన మార్పులు అద్భుతమైనవి. అవి పేదల జీవితాల్లో ఎంత వెలుగులు నింపుతున్నాయో మన కందరకు తెలుసు.భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో ఆ సామాజికాభివృద్ధి స్పష్టంగా కనిపించి తీరుతుంది.ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి.వైఎస్ జగన్ పాదయాత్ర చేస్తూ, ప్రజల వద్దకు పాలనను తెస్తానని హామీ ఇచ్చారు.మాట తప్పని జగన్ చెప్పినట్టే చేస్తున్నారు. ఇప్పుడు ప్రజాపాలన నడుస్తోంది. బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలను ఒక స్థాయికి తీసుకెళ్లారన్నా, రాజకీయ పదవుల్లో కూర్చోబెట్టారన్నా.. ఆ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిగారికే తగ్గుతుంది. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ సోదరులను ఛైర్మన్లుగా, డైరెక్టర్లుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిదే. ఎంపీటీసీ, జెడ్పీసీలుగా బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలను నిలబెట్టి గెలిపించారు జగనన్న.ఇక పేదవర్గాల ఆర్థికస్థాయిని పెంచేందుకు ..వారి ఖాతాల్లో నేరుగా డీబీటీ ద్వారా రూ. 2.36వేల కోట్లు అందించారు సీఎం జగన్. విద్యా, వైద్యరంగాల్లో విప్లవాత్మక మార్పులతో అట్టడుగువర్గాలు, అణచివేయబడ్డ వర్గాలకు గొప్ప మేలు చేశారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి.ఈ రోజు ఆయా వర్గాల పిల్లలు గర్వంగా సర్కారు బళ్లకు వెళుతున్నారన్నా, కార్పొరేట్ స్కూళ్ల స్థాయిలో చదువుతున్నారన్నా అది జగన్ ఘనతే. అలాగే ఎలాంటి జబ్బు భయపడకుండా, కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందేలా చేశారు జగన్.ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలన ప్రజల పాలన. సుపరిపాలన. పారదర్శక పాలన.

## శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో 39 వ రోజు అన్న ప్రసాద వితరణ.



విభారె న్యూస్ డిసెంబర్ 23 ఎమ్మిగనూరు.. శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం లో స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు 39వరోజు23- 12- 2023 శనివారం దాతలు ఎమ్మిగనూరు వాస్తవ్యులు. ఈ.రాఘవేంద్ర గుప్తా శ్రీమతి లత,కే. ఈరన్న శ్రీమతి లక్ష్మి, ఏ.ఈ.నరసయ్య శెట్టి మనవడు బద్రీనాథ్ (యిల్లూరు ప్రింటర్స్) ఎస్.శేషిరెడ్డి శ్రీమతి మంజుల(కంపాడు గ్రామం),జి.భాస్కర్ రెడ్డి శ్రీమతి నర్మద (వెంకటాపురం)ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేసినారు.వారిని వారి కుటుంబాలకు శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి.కృపా కటాక్షములు ఉండాలని,ఎల్లవేళలా ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలనిస్వామి వారిని ప్రార్థిస్తూ. ..ఆలయంలో అన్నదానం పెట్టదలచుకున్న దాతలు కమిటీ వారిని సంప్రదించి తగు తేదీలను నమోదు చేయించుకోగలరు..అదేవిధంగా అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలని,స్వామివారి కృపా కటాక్షములు పొందగలరని కోరుతున్నాము..ఇట్లు - ఆలయకమిటీసెల్: 9951801818.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 23 - శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా నూనెపల్లె లో కన్యకా పరమేశ్వరి దేవస్థానం లో శ్రీ కన్యకా పరమే శ్వరి దేవికి కి వెంకటేశ్వర స్వామి అవతారంతో భక్తులకు దర్శన మిచ్చినది. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో . ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రెసిడెంట్, ఆత్మకూరు సుదర్శన్ శెట్టి, సెక్రటరీ కాలువ విజయ శేఖర్. కార్యదర్శి పోలవరం ప్రసాద్ ఆర్యవైశ్య యువజన సంఘం ప్రెసిడెంట్ మారం నాగరాజు సెక్రటరీ గుబ్బా రజనీకాంత్ అల్వాల్ రఘురామ్ మారం శ్రీనివాసులు మరియు కమిటీ నెంబర్లు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేసామని కమిటీ సభ్యులు తెలిపారు.

## ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం సందర్భంగా మారథాన్ 3ఐ రన్




- - విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 23-నంద్యాల పట్టణం లో శనివారం మునిసిపల్ ఆఫీస్ నుంచి టెక్కే మార్కెట్ యార్డ్ వరకు మారథాన్ 3కే రన్ ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమం లో ఛైర్ పర్సన్ మాబున్నిసా. మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి. మెప్మా పీడీ భాస్కర్ రెడ్డి. సచివాలయ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి. ఎమ్ ఈఈ రమణ మూర్తి. డీఈలు జయబారత్ రెడ్డి. మదు కుమార్. శ్రీనివాస్ రెడ్డి. ఆర్ ఓ వెంకట కృష్ణ. టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి. వైస్ చైర్మన్ పామ్ షావలి. కౌన్సిలర్లు . శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## కోదండరామాలయం లో వైకుంఠ శోభ







---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 23-: నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయం లో ముక్కోటి దర్శనాలకు భక్తులు పోటెత్తారు . వేకువజాము నుంచే భక్తులకు దర్శనాలకు అనుమతించిన శ్రీ భగవత్ సేవా సమాజ్ సమితి . ముక్కోటి ఏకాదశి పర్వది నాన్ని పురస్కరించుకొని వైకుంఠ ద్వారాలు తెరచి భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. స్వామిని దర్శించుకునేందుకు ప్రముఖులు. సామాన్య భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు . దీంతో ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామి దర్శనం చేసుకోవడంముక్తిమార్గంగా భావిస్తారు. దక్షిణాయణం ప్రారంభంలో వచ్చే తొలిఏకాదశి నుంచి ముక్కోటి ఏకాదశి వరకూ విష్ణుమూర్తి యోగనిద్రలో ఉంటాడు. ఆయన వైకుంఠ ఏకాదశి రోజు మేల్కొంటాడు.వైకుంఠ ఏకాదశిని ముక్కోటి ఏకాదశని, స్వర్గద్వార ఏకాదశి అనిపిలుస్తారు. ఈ పేర్లు రావడం వెనుక వేర్వేరు కథనాలు పురాణాల్లోకనిపిస్తాయి. యోగనిద్రలో ఉన్న శ్రీమహావిష్ణువు వైకుంఠ ఏకాదశిరోజు మేల్కొంటాడని పురాణ ప్రశస్తి. ఈ రోజే ముక్కోటి దేవతలువైకుంఠం వెళ్లి శ్రీమహావిష్ణువును సందర్శించు కుంటారని ప్రతీతి.వైకుంఠ ద్వారం నుంచి దర్శనానికి- భక్తులే కాదు, మూడుకోట్లమంది దేవతలూతహతహలాడతారని చెబుతారు. విష్ణువుకొలువై ఉన్న వైకుంఠ ద్వారాలు ఈరోజు తెరుస్తారని వైకుంఠఏకాదశి అంటారు. దక్షిణాయణంలో యోగనిద్రలోకి వెళ్లినమహావిష్ణువు ఈ రోజునే మేల్కొంటాడని ఆర్యోక్తి. ఆ స్వామిని దర్శించుకోవడానికి ముక్కోటి దేవతలూ వైకుంఠానికిచేరుకుంటారు. అందుకే దీనిని ముక్కోటి ఏకాదశి అని పిలుస్తారు. అని తెలిపారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 23- . స్థానిక వైయస్సార్ నగర్ నందమూరి నగర్ 38వ వార్డులో ఇండియన్ జిప్సీ మినిస్ట్రీస్ చర్చి ఆవరణలో సహోజ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పెద్ద స్వాముల నాయక్ క్రీస్తు పుట్టుక గురించి వాక్య సందేశాలు అందించారు. దాదాపు 200 మంది పేద మహిళలకు తాటికొండ బుగ్గ రాముడు దంపతులు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పెద్ద సోముల నాయక్ బాలా నాయక్ స్టీవెన్ జోసెఫ్ సామెల్ పాస్టర్ ఈసు నాయక్ లీలావతి తదితర పాస్టర్లు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## శ్రీ మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పూజలు,



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 23 - నంద్యాల పట్టణం తెలుగు పేటలో వెలసిన శ్రీ మద్దిలేటి లక్ష్మి నరసింహస్వామికి నెమలి పించాలు మరియు విశేష పూల మాలలతో అలంకరణ చేశారు. శనివారం వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) పురస్కరించుకుని ఆలయం లో ఉదయం 4:30 కి భక్తులచే సాముహిక కలశాభిషేకం,పంచామృతఅభిషేకంమరియుస్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు . తదుపరి ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మహా మంగళ హారతి మరియు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ వారుభక్తులకుఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేసారు.

## అహోబిలేషుని సన్నిధిలో మాజీ ఎంపీ గంగుల...

ఆళ్ళగడ్డ ప్రతినిధి డిసెంబర్ 23 విభారె న్యూస్ :- అహోబిల శ్రీ లక్ష్మీనరసింహస్వామి నంద్యాల మాజీ పార్లమెంట్ సభ్యులు గంగుల ప్రతాపరెడ్డి శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా అహోబిలం చేరుకొని ఎగువ,దిగువ అహోబిలంలో కొలువుదీరిన శ్రీ జ్వాల నరసింహ స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లను, శ్రీ ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన రాక సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువైన స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కె డి సి సి బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, అమర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190